క్లుప్తంగా

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



నిజాసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల తహసీల్దార్‌గా లత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తహసీల్దార్ సవాయి సింగ్ ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో లత బదిలీపై ఇక్కడికి వచ్చారు.

విద్యుత్ సౌకర్యం పునరుద్ధరణ



సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి క్రైం: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న విద్యుత్ సదుపాయాలను పునరుద్ధరించకపోవడంపై రెండు రోజుల క్రితం 'సాక్షి' దిన పత్రికలో ప్రచురించిన విద్యుత్ పునరుద్ధరణ గాలికి అనే కథనానికి అధికారులు స్పందించారు. హౌసింగ్ బోర్డు కాలనీ ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలు నెలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన రెగ్జిన్ వర్క్స్ దుకాణానికి కరంట్ సరఫరా ఇప్పించారు. పక్కనే ఉన్న మరో హార్వెస్టర్ గ్యారేజ్‌కు సంబంధించిన మరమ్మతుల పనులు తొందర్లోనే చేపడుతామని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



పిట్లం(జుక్కల్): అల్లాపూర్ గ్రామానికి చెందిన రిపోర్టర్ పండరి కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. అదే విధంగా మండలంలోని గౌరారం తండా మాజీ సర్పంచ్ సక్రు నాయక్, ఆయన సతీమణి కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలిసి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సోమవారం వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

45 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని రైతులకు సోమవారం 45 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి రాజలింగం తెలిపారు. ఆయా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధారి సింగిల్ విండో కార్యాలయం నుంచి చుట్టు పక్కల గ్రామాల రైతులకు 20 మెట్రిక్ టన్నుల యూరియా బస్తాలను, గండివేటు సింగిల్ విండో ద్వారా 25 మెట్రిక్ టన్నులు, నేరల్ సబ్ సొసైటీ నుంచి మరో 10 మెట్రిక్ టన్నుల యూరియా బస్తాలను రైతులకు అందజేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న పైపులైన్ ఏర్పాటు పనులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని జాతీయ రహదారి పక్కన రెండురోజులుగా మిషన్ భగీరథ పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. జాతీయ రహదారి ఏర్పాటు పనుల్లో భాగంగా గతంలో ఉన్న పైపులైన్ ధ్వంసమైంది. ఈ క్రమంలో హైవే సిబ్బంది జాతీయ రహదారి పక్కన నూతనంగా పైపులైన్ వేస్తున్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



కామారెడ్డి అర్బన్: గత నెలలో భారీ వర్షాలకు రోడ్డుపై గుంత ఏర్పడి రాకపోకలకు ఇబ్బంది కలిగినా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంతో దేవునిపల్లి మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు నాగల్ల రాజేందర్ స్పందించి మట్టితో గుంతను పూడ్చారు. కామారెడ్డి పట్టణం 34వ వార్డులో మున్నూరుకాపు సంఘం ఎదురుగా మధురానగర్‌కు వచ్చే రోడ్డుకు గుంతలతో రాకపోకలు బంద్ అయ్యాయి. కాలనీలోని వివేకవర్ధిని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కమిషనర్‌కు తెలిపినా పట్టించుకోలేదు. కాలనీవాసుల ద్వారా విషయం తెల్సుకున్న మాజీ ఉపసర్పంచ్ రాజేందర్ సోమవారం మట్టితో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. మున్సిపల్ అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కొలువుదీరిన అమ్మవారు



కిచ్చన్నపేటలో బాలాత్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. దసరా శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అమ్మవారు మొదటి రోజు బాలాత్రిపుర సుందరి రూపంలో దర్శనమిచ్చారు.



సదాశివనగర్‌లో దుర్గామాత పుస్తెమెట్టెలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న రెడ్డి యూత్ క్లబ్ సభ్యులు



జిల్లా కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో..



బీబీపేటలో కౌండిన్య యూత్ ఆధ్వర్యంలో..



ఎల్లారెడ్డిలో మండపం వద్ద భక్తులు



రాజంపేటలో అమ్మవారి ఆభరణాలు, వస్త్రాలతో సరస్వతి యూత్ ఫెడరేషన్ సభ్యులు



గోర్గల్‌లో దుర్గామాత ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి



దోమకొండలోని చాముండేశ్వరి ఆలయంలో చండీ హవనం కార్యక్రమం..



అయ్యపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



బాన్సువాడలో శోభాయాత్రగా అమ్మవారిని తీసుకెళ్తున్న భక్తులు



భిక్కనూరులో..



కామారెడ్డి పెద్ద బజార్ ఆజాద్ హిందూ మండపంలో..



దేవునిపల్లిలో..

డిమాండ్లను నెరవేర్చాలి



కామారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సీఐటీయూ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పంచాయతీ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. అంతకు ముందు కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టి డీపీవో కార్యాలయంలో బైఠాయించి అరగంట పాటు ధర్నాకు దిగారు. డీపీవో మురళీతో వాగ్వాదానికి దిగారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు కార్మికులు గురవుతున్నారని, పండుగలను జరుపుకోలేకపోతున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి నెలా 1న వేతనాలు ఇవ్వాలన్నారు. ఈనెల 28 వరకు వేతనాలు అందేలా చూస్తానని డీపీవో హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాల్‌నర్సు, కార్యదర్శి శ్యామ్, ఉపాధ్యక్షులు అంజవ్వ, బాల్‌నర్సు, దత్తురావు, కార్మికులు పాల్గొన్నారు.

వంతెన మరమ్మతులు వేగంగా చేపట్టాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): 'గత నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు) వద్ద పాముల వాగు వంతెన వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. నెల రోజులుగా బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి రోడ్డులో బస్సులు నెల రోజులుగా నడవకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. లింగంపేట నుంచి పొల్కంపేట రోడ్డు వరకు ప్రయాణికులు నడిచి వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోంది' అని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం బ్రిడ్జి పక్కన భారీ పైపులు వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేయడానికి రూ. కోటి మంజూరు చేసింది. శాశ్వత బ్రిడ్జి నిర్మాణం జరిగే వరకు తాత్కాలికంగా మరమ్మతులు ప్రారంభించిన ఆర్‌అండ్‌బి అధికారులు పనులు నిలిపివేయడంతో సోమవారం బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. వంతెన పనులు వేగంగా చేపట్టాలని డిమాండు చేశారు. లేదంటే ధర్నాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పండుగ సరుకులు కొనుగోలు చేయడానికి కామారెడ్డి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అనంతరం లింగంపేట ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, నాయకులు ఉదేశ్, బాలయ్య, విష్ణువర్దన్, నవీన్‌కుమార్, సాయిలు, రవి, సంతోష్, సురేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వరద బాధితులకు దుస్తులు, రేషన్ కిట్ల పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి): గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులైన వారితో పాటు వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థ వారు సోమవారం దుస్తులు, రేషన్ కిట్లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన 'సోషల్ సర్వీస్ సొసైటీ' వారి సహకారంతో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన 'లైట్ ఫర్ బ్లైండ్ స్వచ్ఛంద సంస్థ' ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో బాధితులకు బెడ్‌షీట్లు, టవల్, బ్లాంకెట్స్, రేషన్, నూనె, గోధుమ పిండి, నాలుగు రకాల పప్పులు, బియ్యం, సర్ఫ్, షుగర్, టీ పొడి, సబ్బులు తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ.. ఆపత్కాలంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రజలకు ఆదుకోవడం అభినందనీయమన్నారు. అలాగే ప్రభుత్వం తరపున సహాయం కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఆంటోని హస్సా, కామారెడ్డి స్వచ్ఛంద సంస్థకు చెందిన నబీ, స్వర్ణలత, ఆర్ఐ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



గర్గుల్‌లో బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న మహిళలు



భిక్కనూరులో..

కామారెడ్డి రూరల్/భిక్కనూరు: జిల్లాలో బతుకమ్మ సంబురాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి ఆడి పాడారు. మహిళలు, యువతులు, చిన్నారులు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఉంచి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం ఆయా గ్రామాల్లోని నీటి కుంటలు, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

బీబీపేట: డ్వాక్రా మహిళలు రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలని మండల సమాఖ్య అధ్యక్షులు సదాల స్రవంతి అన్నారు. సోమవారం బీబీపేట మండల సమాఖ్య 100వ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, వెంకట్ గౌడ్, కార్యదర్శి దివ్య, కోశాధికారి లత, కంప్యూటర్ ఆపరేటర్ రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏవో రాజలింగం



గౌరారంలో వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గాంధారి(ఎల్లారెడ్డి): వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రాజలింగం సూచించారు. సోమవారం గాంధారి శివారులోని వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం వరిలో మొగి పురుగు, మెడవిరుపు, ఎండు తెగులును గమనించినట్లు పేర్కొన్నారు.

మొగిపురుగు నివారణకు కార్టప్ హైడ్రో క్లోరైడ్ 50 ఈసీ 400గ్రాములు లేదా క్లోరంటనిలిప్రోల్ 600 ఎంఎల్ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మెడవిరుపు నివారణకు అజాక్సీస్ట్రోబిన్, టేబుకొనజోల్ 300 ఎంఎల్ ఎకరానికి, పైరక్సి స్ట్రోబిన్, ట్రైసైక్లోజల్ 250 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. వరి ఎండు తెగులుకు ప్లాంటమైసిన్ 800 ఎంఎల్, కాపార్ ఆక్సీక్లోరైడ్ 600గ్రాములు, అగ్రి మైసిన్ 800 ఎంఎల్, కాపార్ ఆక్సీక్లోరైడ్ 600 ఎంఎల్ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు నత్రజని సంబంధిత ఎరువులను తగ్గించి వాడాలని సూచించారు.

వరి పంటలను పరిశీలించిన డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు

పిట్లం(జుక్కల్): గౌరారం శివారులో సోమవారం డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు అనిల్ రెడ్డి, రేవంత్‌లు క్షేత్ర స్థాయిలో వరి పంటలను పరిశీలించారు. రైతులకు తెగుళ్లకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ రెడ్డి, రైతులు బాబు సింగ్, లక్ష్మాగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు ఒక చోట.. పనులు మరో చోట

- రోడ్డు పక్కన 3 ఫీట్ల దూరంలోనే వేసిన విద్యుత్ స్తంభాలు
- రైస్‌మిల్ యజమానితో విద్యుత్ సిబ్బంది కుమ్మక్కు
- బీర్కూర్‌లో ట్రాన్స్‌కో అధికారుల తీరు



గతంలో వ్యవసాయ భూముల మధ్యలో వేసిన విద్యుత్ స్తంభాలు



బీర్కూర్- పాతంగల్ రోడ్డు పక్కనే ఆర్‌అండ్‌బీ హద్దు దాటి వేసి విద్యుత్ స్తంభాలు

బాన్సువాడ : ట్రాన్స్‌కో అధికారుల నిర్వాహకం.. ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు డీడీలు చెల్లించినా కనెక్షన్లు ఇవ్వకుండా ఏదో ఒక సాకు చెప్పి రైతులను తిప్పించుకుంటున్న ఘటనలున్నాయి. కానీ రైస్‌మిల్ యజమానుల పనులు మాత్రం చకచకా జరిగిపోతున్నాయి. బీర్కూర్ మండల కేంద్రంలోని బీర్కూర్-పాతంగల్ ప్రధాన రహదారి పక్కన ఇటీవల ఓ రైస్ మిల్ నిర్మాణం చేపట్టారు. ఆ రైస్‌మిల్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ కనెక్షన్ కోసం రైస్‌మిల్ యజమాని డీడీలు తీసి స్థానిక ట్రాన్స్‌కో అధికారులకు పనులను అప్పగించారు. స్థానిక ట్రాన్స్‌కో అధికారులు మాత్రం రైస్‌మిల్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పాటు 16 విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు, ఇతర సామగ్రి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. విద్యుత్ స్తంభాలు పాతడం, వైర్లు లాగడం, ఇతర సామగ్రి కొనుగోలు చేసి పనులను త్వరగా చేసేలా ఓ ప్రైయివేటు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అయితే ప్రతిపాదనల్లో ఉన్న దానికి ప్రస్తుతం రైస్‌మిల్ వద్ద కొనసాగుతున్న విద్యుత్ పనులకు ఎలాంటి సంబంధం లేదు. నిబంధనల ప్రకారం ట్రాన్స్‌కో అధికారులు పంపిన ప్రతిపాదనల్లో రహదారి నుంచి 9 ఫీట్ల తర్వాత విద్యుత్ స్తంభాలు వేస్తున్నట్లు పంపారు. కానీ అక్కడ స్థానికంగా ఉన్న ట్రాన్స్‌కో సిబ్బంది మాత్రం రహదారి పక్కన మూడు ఫీట్లలోనే విద్యుత్‌స్తంభాలు వేసి పనులు చకచకా చేస్తున్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా రైస్ మిల్‌కు సంబంధించిన విద్యుత్ కనెక్షన్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్లు రోడ్డు పక్కనే వేయడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ప్రమాదం జరగక ముందే నిబంధనల ప్రకారం విద్యుత్ స్తంభాలను రోడ్డుకు 9 ఫీట్ల దూరంలో వేయాలని వాహనదారులు అంటున్నారు.

9 ఫీట్ల దూరంలో వేయాలి

ప్రతిపాదనల్లో ఉన్న ప్రకారమే పనులు చేయాలి. రోడ్డుకు ఇరువైపులా 9 ఫీట్ల తర్వాత విద్యుత్ స్తంభాలు వేయాలి. ప్రతిపాదనలు ఇంకా చూడలేదు. చూసిన తర్వాత చెబుతాం.

– ప్రభాకర్, ఇన్‌చార్జి డీఈ ట్రాన్స్‌కో, బాన్సువాడ

సంక్షిప్తం

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్



పిట్లం(జుక్కల్): పిట్లం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసంలో భాగంగా పోషణ్ అభియాన్ పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సౌభాగ్య, సూపర్ వైజర్ సుమలతలు మాట్లాడుతూ.. ఆకు కూరలు, కూరగాయాలు, చిరు ధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, వీటిని సరైన పద్ధతిలో వినియోగించుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు.

ఆరేపల్లిలో..



నిజాంసాగర్(జుక్కల్): ఆరేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పోషకాహారాల వినియోగంపై గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి అవగాహన కల్పించారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కలశాభిషేకం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. పట్టణంలోని వైశ్య భవన్‌లో గల అమ్మవారికి వైశ్య సంఘం సభ్యులు ముత్యాల పోచమ్మ అమ్మవారి ఆలయం నుంచి వైశ్యభవన్ వరకు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం పూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు సుదర్శన్, సంతోష్, విఠల్ ఉన్నారు.

లక్ష్మాపూర్‌లో సామూహిక సీమంతాలు



ఎల్లారెడ్డిరూరల్: లక్ష్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులకు అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సామూహిక సీమంతాలు చేశారు. ప్రతి గర్భిణీ పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు.